క్లుప్తంగా

నెలాఖరులోగా రిటర్న్‌లు దాఖలు చేయండి

కొవ్వూరు: ఆదాయపు పన్ను చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్‌దారులందరూ ఈ నెలాఖరు లోగా ఫారం-16ను సబ్ ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్‌దారుల సంఘం కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు కోరారు. ఫారం-16 దరఖాస్తులు సబ్ ట్రెజరీలో అందుబాటులో ఉంటాయన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



పంపిణీ చేయనున్న గొడుగులతో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, రోటరీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని పేదలు, ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా గొడుగుల పంపిణీ చేశారు. రొటేరియన్ గొన్నా బత్తుల రామారావు ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఈ గొడుగులను మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, వేదాల విజయలక్ష్మి, యాసరపు రామకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ పోలాదాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

నిడదవోలు: పట్టణంలోని నెహ్రూనగర్, బాలాజీనగర్‌లకు శనివారం సాయంత్రం మంచినీటి సరఫరా నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. నెహ్రూనగర్‌లోని పంపుహౌస్ నుంచి వచ్చిన పైప్‌లైన్‌లో మూడు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. ప్రజల తాగునీటి అవసరాల మేరకు త్వరితగతిన వాటికి మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం నెహ్రూ నగర్, బాలాజీనగర్ రిజర్వాయర్ల పరిధిలోని వార్డుల ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

విజయ గణపతి ఆలయంలో పూజలు



తాడిపర్రులో ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలోని విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని పల్లంట్ల గ్రామంలో శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి.సుదీర్, సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

నల్లజర్ల: శాప్, పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల శాఖ ఆధ్వర్యంలో దూబచర్ల లో 37 రోజుల పాటు నిర్వహించిన వేసవి యోగా, చెస్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా యోగా, చెస్‌లలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. చెస్‌లో ప్రథమ బహుమతి చోడిశెట్టి సచిన్, ద్వితీయ బహుమతి కాసాని రవిత్రేణి, తృతీయ బహుమతి మెట్టపల్లి సాయి లోకేష్ గెలుచుకున్నారు. ఇక యోగా పోటీల్లో ప్రథమ బహుమతి కోమలి భాగ్యశ్రీ , ద్వితీయ బహుమతి కాసాని లావణ్య, తృతీయ బహుమతి కోమలికృష్ణ గెలుచుకున్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు రాజారావు, పార్థ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, గ్రామ కార్యదర్శి బీవీ రత్నం, సోమిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య .. ఇంటికి చేరువగా

- పోతవరం హైస్కూల్లో జూనియర్ ఇంటర్‌కు అనుమతి
- ఈ ఏడాది నుంచి బైపీసీ, ఎంపీసీ తరగతులు



హైస్కూల్ ప్లస్ అయిన పోతవరం ఉన్నత పాఠశాల



అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నల్లజర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో విద్యా శాఖ మండల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. మనబడి, నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం ఇప్పటికే సమూలంగా మార్చింది. అన్ని ఆధునిక వసతులూ కల్పించింది. అవే ప్రాంగణాలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తోంది. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో రెండేళ్ల క్రితమే బాలికలకు ఇంటర్ తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ ఏడాది కొత్తగా పోతవరం హైస్కూల్లో బాలబాలికలకు (కో-ఎడ్యుకేషన్) జూనియర్ ఇంటర్ తరగతుల ప్రారంభానికి విద్యాశాఖ అనుమతించింది. ఈ విషయాన్ని ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవస్థలు ఈ ప్రాంత విద్యార్థులకు తొలగాయి. ఫలితంగా చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా, దూరాభారం వల్ల అర్ధాంతరంగా చదువుకు స్వస్తి చెప్పే గ్రామీణ పేద విద్యార్థుల సంఖ్య బాగా తగ్గుతుంది.

అందుబాటులో రెండు గ్రూపులు

ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో డిమాండ్ ఉన్న ఎంపీసీ, బైపీసీ గ్రూపులను పోతవరం కో-ఎడ్యుకేషన్ జూనియర్ ఇంటర్ కళాశాలలో నిర్వహించనున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపును తీసుకోవచ్చు. ఈ కళాశాలలో ఒక్కో గ్రూపునకు 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమం బోధన చేస్తుండడం విద్యార్థులకు కలిసొచ్చే అంశం. మొత్తం 80 మంది విద్యార్థినీవిద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య అభ్యసించడానికి విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలూ తీసుకున్నారు. పోతవరం పరిసర గ్రామాల్లో కొత్తగా టెన్త్ పాసైన విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేస్తున్న జూనియర్ కళాశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే పనిలో ఇప్పటికే ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. పోతవరం హైస్కూల్ ఉపాధ్యాయులు పరిసర గ్రామాలకు స్వయంగా వెళ్లి అడ్మిషన్లు చేయిస్తున్నారు.

28 మందికి అడ్మిషన్లు



పోతవరం జెడ్పీ హైస్కూల్లో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేస్తున్న హైస్కూల్ ప్లస్ (కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల)లో చేరేందుకు ఇప్పటికే 28 మంది విద్యార్థులు సంసిద్ధత వ్యక్తం చేశారు. వారందరికీ అడ్మిషన్లు ఇస్తాం. అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఫస్టియర్‌లో చేరే విద్యార్థినీవిద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ చేరిన విద్యార్థులందరికీ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యాబోధన చేస్తాం. అంతేగాకుండా ఎంసెట్‌లో శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం.

– గోపి గోవర్ధన్, హెచ్‌ఎం, పోతవరం హైస్కూల్

ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్



ఈఏడాది నుంచి హైస్కూల్ ప్లస్‌గా మారిన పోతవరం హైస్కూల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. పరిసర గ్రామాలలో విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నాం. పదో తరగతి తర్వాత ఏ ఒక్కరూ చదువు మానేయకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకనుగుణంగా పోతవరం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

– వై.సత్యనారాయణ, ఎంఈఓ-1, నల్లజర్ల

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి



తాడిపర్రులో విద్యార్థిని నుంచి ప్రవేశ దరఖాస్తు స్వీకరిస్తున్న అధ్యాపకులు

ఉండ్రాజవరం: ప్రభుత్వ కళాశాలల్లోని సదుపాయాలను, ప్రభుత్వం కల్పించే రాయితీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ప్లస్ (జూనియర్ కళాశాల) అధ్యాపకుడు మాణిక్యాలరావు సూచించారు. ఈ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల ప్రవేశాల కోసం కళాశాల అధ్యాపకులు శుక్రవారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉండ్రాజవరం, తాడిపర్రు, వెలగదుర్రు తదితర గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికల ఇళ్లకు వెళ్లి తమ జూనియర్ కళాశాల గతేడాది ప్రగతి గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. పూర్తిస్థాయిలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. పలువురు విద్యార్థినుల నుంచి ప్రవేశ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డి.ఉదయ భాస్కరరావు, కోట రామప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, పి.నిరీక్షణ రాజు, బి.పద్మజారాణి, జి.అజుబ, జి.మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12,012 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం

- ఏడీఏ చంద్రశేఖర్



చంద్రశేఖర్, ఏడీఏ



అన్నవరప్పాడు సొసైటీ గోడౌన్‌లో సిద్ధంగా ఎరువులు

పెరవలి: ఖరీఫ్ వరిసాగుకు అవసరమైన ఎరువులను ముందుగానే సిద్ధం చేశామని వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) పి.చంద్ర శేఖర్ తెలిపారు. నియోజకవర్గంలో 36,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తారన్న అంచనాల మేరకు సొసైటీలు, ప్రైవేట్ డీలర్లు, డీసీఎంఎస్ డిపోల్లో ఎరువులను సిద్ధం చేశామని తెలిపారు. 12,012 మెట్రిక్ టన్నుల పొటాష్, యూరియా, సూపర్, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఇవే కాకుండా ప్రైవేట్ డీలర్ల వద్ద మరో 10 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎటువంటి కొరత లేకుండా సమయానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచామని చెప్పారు.

మండలాలవారీగా సిద్ధంగా ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

మండలం	యూరియా	సూపర్	కాంప్లెక్స్	పొటాష్
ఉండ్రాజవరం	1128	454	759	380
నిడదవోలు	1647	728	1089	554
పెరవలి	1757	688	1757	1071
మొత్తం	4532	1870	3605	2005

మహిళల అక్రమ రవాణాపై జాగ్రత్త

- అవసరమైతే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి
- ఐసీడీఎస్ పీవో మమ్మి

కొవ్వూరు: నిత్యం ఎంతోమంది మహిళలు, యువతులు అక్రమ రవాణాకు గురవుతున్నారని, దీని నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు తోడ్పాటు అందించాలని సీడీపీవో డి.మమ్మీ, హైదరాబాద్‌కు చెందిన ప్రజల్వ సంస్థ కో-ఆర్డినేటర్ టి.శ్రావ్య శృతి కోరారు. మహిళల అక్రమ రవాణా నియంత్రణపై రెండు రోజులుగా పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటి సదస్సులో వారిద్దరూ మాట్లాడుతూ ఉద్యోగం, ఉపాధి, సినిమా అవకాశాల పేరుతో ఈ మోసాలు సాగిస్తున్నారన్నారు. ఇలా మోసగించిన యువతులు, మహిళలను విదేశాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలకు అమ్ముతున్నారన్నారు. ఇలాంటి ఉదంతాలపై తమ పరిధిలోని ప్రతి మహిళకూ అవగాహన కల్పించాలని వారిద్దరూ సూచించారు. మహిళల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పని చేస్తోందని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి అన్నారు. పద్మశ్రీ సునీతా కృష్ణన్ ఆధ్వర్యంలో 28 ఏళ్లుగా ఈ సంస్థను నడుపుతున్నామన్నారు. స్త్రీ,శిశు సంక్షేమం, పోలీసు, విద్య, న్యాయ శాఖల తోడ్పాటుతో ఇప్పటి వరకూ 28,200 మంది మహిళలు,యువతులను కాపాడి పునరావాసాలకు చేర్చామన్నారు. మహిళలను మోసగించేందుకు అనుమానితుల నుంచి మొబైల్ కాల్స్, మెజేజ్‌లు వచ్చినపుడు జాగ్రత్త వహించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తినపుడు 1930 అనే ట్రోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు. లైగింక వ్యాపారానికి పేద, మధ్యతరగతి యువతులను ఎంపిక చేసి సినిమా అవకాశాలు, ఉద్యోగం ఆశ చూపించి తీసుకెళ్లి వ్యభిచార గృహాలకు అమ్మేస్తున్నారన్నారు. అక్కడ యువతులు, మహిళలు దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆమె అన్నారు. లఘు చిత్రాల ద్వారా మహిళల అక్రమ రవణాపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శివ, సుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో డి.మమ్మి, ప్రజ్వల సంస్థ కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల కొరడా

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై ఈనెల 5న 'సాక్షి'లో 'మట్టి ట్రాక్టర్ల జోరు.. ప్రజల జోరు' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కాటకోటేశ్వరం గ్రామంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇకపై అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగభూషణం హెచ్చరించారు. మట్టి అక్రమ తవ్వకాలు జరిగితే గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ ప్రోద్బలంతోనే ఆశ కార్యకర్తల ధర్నా

- ఏఎన్‌ఎం దుర్గాదేవి ఆరోపణ

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తనపై ఆ పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ కక్ష కట్టారని ఏఎన్‌ఎం దుర్గాదేవి పేర్కొన్నారు. ఆయన ఆశ కార్యకర్తలను రెచ్చగొట్టి తనకు వ్యతిరేకంగా ధర్నా, ఆందోళన చేయించారని ఆమె శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఏఎన్‌ఎం దుర్గాదేవి తమను మానసికంగా వేధిస్తున్నారంటూ ఆశ కార్యకర్తలు గురువారం పోతవరం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేసిన విషయం విదితమే. దీనిపై దుర్గాదేవి వివరణ ఇచ్చారు. స్థానికంగా వ్యాక్సిన్ ఏర్పాటు చేయమని కోరానని, మూడు ధపాలుగా పీహెచ్‌సీకి వచ్చిన హెచ్‌డీఎఫ్ నిధులు ఏమయ్యాయని డాక్టర్‌ను ప్రశ్నించానని ఆమె తెలిపారు అంతేగాకుండా డాక్టర్ రాజశేఖర్ పోతవరంలో నివాసం ఉండడం లేదన్నారు. రోజూ విజయవాడ నుంచి విధులకు హాజరవుతూ, మధ్యాహ్నం తిరిగి వెళ్లిపోతున్న విషయాన్ని ప్రశ్నించినందుకే తనపై డాక్టర్ రాజశేఖర్ కక్ష కట్టి పలు ధపాలుగా మెమోలు ఇచ్చారని వివరించారు. ఈ కారణాలు తప్ప ఆశ కార్యకర్తలపై తనుకు ఎలాంటి ద్వేషం లేదని ఏఎన్‌ఎం దుర్గాదేవి వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారాలపై కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై డాక్టర్ రాజశేఖర్ వివరణ ఇస్తూ రోగులకు సక్రమంగా సేవలు అందించనందుకే దుర్గాదేవికి మెమో ఇచ్చానన్నారు. రెండు ధపాలుగా వచ్చిన హెచ్‌డీఎఫ్ నిధులు రూ.2 లక్షలను కమిటీ ఆదేశాల మేరకు ఖర్చు చేశామన్నారు.

మలేరియాపై అవగాహనా ర్యాలీ



గౌరీపట్నంలో మలేరియా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యుడు

దేవరపల్లి: ఇంటి పరిసరాల్లో నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు వివరిస్తూ గౌరీపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చిన్నికృష్ణుడు మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడిపడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, మొక్కల కుండీలు, ఫ్రీజర్, వాటర్ కూలర్లలో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని, మలేరియా వ్యాధి రాకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ వి.ఆశోక్‌వర్ధన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమతెరలు వాడాలి

ఉండ్రాజవరం: వర్షాకాలంలో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ఉండ్రాజవరంలో శుక్రవారం మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా సోకిన వారిలో చలి, వణుకు విపరీతమైన జ్వరం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి నివారణకు ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకుడు జిన్నూరి శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య సిబ్బంది, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

12న పాఠశాలల పునః ప్రారంభం

నిడదవోలు రూరల్: వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలను పునః ప్రారంభిస్తామని ఎంఈఓ కేవీ గణేష్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు, విద్యాసామగ్రి సిద్ధంగా ఉన్నాయన్నారు. మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5,978 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, టైలు, షూలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు.

పాలకుడిగా కాదు .. సేవకుడిగా పని చేస్తా

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరమ్మ గుడిలో మొక్కు చెల్లింపు



కొవ్వూరమ్మ గుడి వద్ద మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పాలకుడిగా కాకుండా, సేవకుడిలా కొవ్వూరు నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఏటిగట్టుపై ఉన్న కొవ్వూరమ్మ గుడిలో ఆయన శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి మొక్కు చెల్లించుకున్నారు. ముప్పిడి ఎమ్మెల్యేగా గెలిస్తే 108 కొబ్బరి కాయలు కొడతామన్న మొక్కును ఆ పార్టీ నాయకులు చెల్లించుకున్నారు. అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ,గాజులతో కూడిన సారె సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పడతానన్నారు. తన విజయానికి కృషి చేసిన జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో అన్న సమారాధన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. స్వామివారి జయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్యకర్తలు సమన్వయం పాటించాలి

గోపాలపురం: గెలుపు,ఓటములను సమానంగా తీసుకొని కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని టీడీపీ గోపాలపురం మండల శాఖ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ అన్నారు. గోపాలపురం ఎమ్మెల్యేగా గెలిచిన మద్దిపాటి వెంకట్రాజుకు మద్దతుగా పెద్దగూడెంలో శుక్రవారం ఎన్టీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. పెద్దగూడెం పోశిబోయిన రత్నకుమారి, టీడీపీ గోపాలపురం పట్టణశాఖ అధ్యక్షుడు జేష్ట శ్రీధర్, నాయకులు మద్దిపాటి రమేష్‌బాబు, కూనపోము ప్రసాద్,తానేటి రాఘవులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



రెల్లి హరీష్ మృతదేహం

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామంలో జనసేన పార్టీ ఫ్లెక్సీ కడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం రాత్రి యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం రావిమెట్లకు చెందిన రెల్లి వెంకటేశ్వరరావు కుమారుడైన హరీష్ (21) తాపీ పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. నిడదవోలు ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్‌కు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలుపుతూ రూపొందించిన ఫ్లెక్సీని గ్రామంలో రోడ్డు పక్కనే హరీష్ ఏర్పాటు కట్టసాగాడు. ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లు అతడికి తగలడంతో షాక్‌కు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాద వివరాలు నమోదు చేస్తున్నట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

గ్రంథాలయాల్లో ముగిసిన విజ్ఞాన శిబిరాలు

నల్లజర్ల: గ్రంథాలయాల్లో గత నెల 15 నుంచి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఆరు నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని తమకిష్టమైన ఆటపాటలు నేర్చుకున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, ఈజీ గణితం, పుస్తకాలు,కథలు చదవడం వంటి అంశాల్లో నైపుణ్యం పెంచుకున్నారు. ముగింపు సమావేశంలో రిటైర్డు ఉపాధ్యాయులు గొట్టిపాటి శ్రీరామచంద్రమూర్తి, మద్దిపాటి నాగవరప్రసాద్, ఎ.శ్రీహరి, ఎస్కే ఖాన్, టీచర్ యర్రా సాయిబాబా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరికీ మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. గ్రంథ పాలకురాలు ఏవీ రమణ కూడా పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో, రీడర్స్ ఫోరం గౌరవాధ్యక్షుడు చెరుకు ఆంజనేయులు గ్రంథాలయాధికారి ఎ.నరేష్ , గుండుబోగుల ఆదినారాయణ, పోస్ట్ మన్ సీహెచ్ నాగలింగం, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమాలను పెరవలి, ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పలు విషయాలను విద్యార్థులతో ముచ్చటించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ, పెరవలి, తీపర్రు, ముక్కామల లైబ్రేరియన్లు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పెరవలి గ్రంథాలయంలో విజేతలకు బహుమతుల అందిస్తున్న నిర్వాహకులు